

ఫూలే ఆశయాలు

కొనసాగిద్దాం

- కలెక్టర్ టీఎస్ చేతన్



ఫూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహాత్మ జ్యోతిబా ఫూలే ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒకరు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. స్థానిక గణేష్ కూడలిలోని అబ్దుల్ కలాం మైనార్టీ కమ్యూనిటీ సమావేశ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జ్యోతిబా ఫూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలంతా సమానత్వంతో జీవించాలని ఫూలే ఆకాంక్షించారన్నారు. గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. విద్య వికాసంతోనే వివక్ష నిర్మూలన సాధ్యమని నమ్మిన వ్యక్తి అన్నారు. బాల్యవివాహాలు, సతీసహగమనం నిర్మూలన కోసం అనే అనేక పోరాటాలు చేశారన్నారు. అలాంటి మహనీయుడి అడుగు జాడల్లో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వెనుకుడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి నిర్మలాజ్యోతి, డీఎస్పీ విజయ్‌కుమార్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, శ్రీరాములు, చలపతి పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత ఫూలే: ఎస్పీ రత్న



జ్యోతిబా ఫూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దళిత బహుజనుల స్ఫూర్తి ప్రదాత, సామాజిక చైతన్యం కోసం ఎన్నోత్యాగాలు చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిబా ఫూలే అని ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఫూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ దేశంలో మనుషులంతా సమానత్వంతో జీవించాలని, విద్యావికాసంతోనే వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని నమ్మిన గొప్ప వ్యక్తి ఫూలే అన్నారు. ముఖ్యంగా బాలిక, మహిళా విద్య అవసరాన్ని ఆనాడే గుర్తించి మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. ఫూలే దంపతులు చేసిన కృషి ఫలితంగా నేటి సమాజంలో స్త్రీవిద్యకు ఎంతో ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐ వలి, సీఐలు శ్రీనివాసులు, సతీష్, తిమ్మారెడ్డి, ఎస్పీ ఎస్బై ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల

బీభత్సం..!



1050.47 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

రూ.10.29 కోట్ల నష్టం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

6



భక్తుల నడుమ తమిళుల సాంస్కృతిక ప్రదర్శన



నెమలి పింఛాలతో.. ఒంటి నిండా శూలాలతో..

భక్తి విన్యాసాలు

పంగణి నక్షత్రాన్ని పురస్కరించుకుని వేడుకలు

సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణం, రథోత్సవం

పురంలో తమిళుల సంప్రదాయ వేడుకలు



నోటికి శూలాలతో విన్యాసాలు చేస్తూ..

హిందూపురం అర్బన్ ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'తమిళుల అపార దైవ భక్తి చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో చూపరులను ఆకట్టుకుంటారు' అని మునిసిపల్ చైర్మన్ రమేష్ పేర్కొన్నాడు. హిందూపురంలోని పళనీనగర్, ఇందిరా నగర్ ప్రాంతాల్లో స్థిరపడిన తమిళులు తమ సంప్రదాయం ప్రకారం పంగణి నక్షత్రంను పురస్కరించుకొని సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, రథోత్సవాన్ని శుక్రవారం స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు తమిళ భక్తులు అక్కడ అగ్నిగుండం ఏర్పాటు చేసి, అందులో ప్రవేశించారు. అనంతరం చిన్నా పెద్ద తేడా లేకుండా నోటికి, కడుపునకు, వీపునకు శూలాలు గుచ్చుకొని విన్యాసాలు చేశారు. కొంత మంది వీపు, కాళ్లకు కొక్కీలు తగిలించుకొని క్రేన్‌కు వేలాడారు. ఈ సందర్భంగా తమిళులతో పాటు హిందూపురం పట్టణ ప్రజలు కూడా సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొకులు తీర్చుకున్నారు.

భూ వివాదాలు గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్



పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భూవివాదాలను రెవెన్యూ అధికారులు నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో రెవెన్యూ సేవలపై శుక్రవారం జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్, లోకాయుక్త, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలిచ్చిన అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంతృప్తి సమాధానాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వీవీఎస్ శర్మ, ఆనంద్, ల్యాండ్ సర్వే జిల్లా అధికారి విజయశాంతిబాయి, జిల్లాలోని తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కందువా మార్చేద్దామా..?

టీడీపీ వైపు వైసీపీ కౌన్సిలర్ల చూపు

పుట్టపర్తి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీలో ఉన్నా ఓటేసిన ప్రజలకు ఏమీ చేయలేకపోయాం. పేరుకు మున్సిపల్ కౌన్సిలర్లమైనా నిధులు లేవు, విధులూ లేవు. ఇంకో ఏడాదిలో పదవీ కాలం పూర్తవుతుంది. కనీసం ఈ పనిచేశామని చెప్పుకునేందుకైనా ఏదో ఒకటి చేయాలి. అందుకు అవసరమైన నిధులు అధికార పార్టీలో ఉంటేనే వస్తాయి. అందుకే పార్టీ మారితే బాగుంటుందన్న ఆలోచనలో పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలోనే కొందరు కౌన్సిలర్లు పార్టీ వీడి టీడీపీలోకి చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

మీరు రమ్మంటే మేము వస్తాం..

మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా అందులో వైసీపీకి 13 మంది, టీడీపీకి ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. ప్రస్తుతం వైసీపీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి దింపాలంటే టీడీపీకి మరో నలుగురు కౌన్సిలర్ల అవసరం ఉంది. టీడీపీ కౌన్సిలర్ చైర్మన్ అయితే అభివృద్ధికి నిధులు బాగా వస్తాయన్న ఆశ నెలకొంది. దీంతో కొందరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులతో ఇప్పటికే పలుమార్లు మంతనాలు జరిపినట్లు సమాచారం.

అసంతృప్తే కారణమా?

కౌన్సిలర్‌లుగా గెలిచినా నిధులు రాకపోవడం, ఏ మాత్రం ప్రాధాన్యం లేకపోవడంతో పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కనీసం ఆయా వార్డుల పరిధిలో వీధిలైట్లు వేయాలన్న అడుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు కౌన్సిలర్‌లు వాపోయినట్లు సమాచారం. ఒక సీసీరోడ్డులేదు, వీధిలైట్లు లేవు. తాగునీటి బోరు పాడైపోతే రిపేరీ చేయించుకోవడానికి కొందరు నాయకులను అడుక్కోవాల్సివచ్చిందని, నాలుగేళ్లలో నానా వేదన పడ్డామన్న అందుకే పార్టీ వీడటానికి సిద్ధమైనట్లు చెబుతున్నారు. గత వారం రోజులుగా టీడీపీ నాయకులతో మధ్యవర్తుల ద్వారా మంతనాలు జరుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

కూలి పనులకు వెళ్లి మృత్యువాత

కడప జిల్లా బలపనూరు వద్ద రోడ్డు ప్రమాదం

యాడికి వాసి దుర్మరణం



వెంకటరాముడు (ఫైల్)

యాడికి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు (32) కడప జిల్లాకు కూలి పనులకు వెళ్లి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఓబులాపురం గ్రామస్తులు తెలిపిన వివరాలమేరకు.. వెంకటరాముడు అరటికాయలు కోసే కూలి పనులకు కడప జిల్లాకు వెళ్లాడు. శుక్రవారం అక్కడ ద్విచక్రవాహనంలో పనికి వెళ్తుండగా బలపనూరు వద్ద జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో వెంకటరాముడు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటరాముడు మృతదేహాన్ని పులివెందుల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వెంకటరాముడుకు భార్య మాధవి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి



బాబు (ఫైల్)

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీసెల్ మండల కోశాధికారి బాబూ(45) శుక్రవారం మృతి చెందారు. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన మేరకు... కొండాపురం గ్రామానికి చెందిన బాబు పని నిమిత్తం కర్ణాటకలోని తిరుమణికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తిమ్మాపురం గ్రామ సమీపంలో రాత్రి బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన గల గుంతలోకి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన లేవలేక తెల్లవారే వరకు అక్కడే ఉన్నాడు. తెల్లవారుజామున అటువైపు కూలి పనులకు వెళ్తున్న స్థానికులు చూసి, బాధితుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. బాబును పావగడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య సపూరా, కుమారులు ఇర్షాన్, బాబు ఉన్నారు. మండలానికి చెందిన టీడీపీ నాయకులు పలువురు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో కుక్కల బెడదను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి సూచించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో పంచాయతీ అధికారులు, మెడికల్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పంచాయతీలను క్లస్టర్లుగా విభజించి, ఒక్కో పంచాయతీకి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, గ్రామస్థాయి పంచాయతీ అధికారి, మెడికల్ ఆఫీసర్‌ను అప్రమత్తం చేయాలన్నారు.

ఈదురుగాలుల బీభత్సం..!

● 1050.47 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు ● రూ.10.29 కోట్ల నష్టం ● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లాలోని కంబదూరు, కళ్యాణదుర్గం, కూడేరు, బ్రహ్మసముద్రం బెలుగుప్ప, ఉరవకొండ, కుందుర్పి, రాయదుర్గం శెట్టూరు, కణేకల్లు, గుమ్మఘట్ట మండలాల్లో 131.47 హెక్టార్లలో రూ.3.15 కోట్ల విలువైన అరటి, మామిడి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, కర్బూజ తదితర పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ పరంగా రాయదుర్గం, గార్లదిన్నె, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, బెలుగుప్ప, డి. హిరేహాళ్ మండలాల్లో 919 హెక్టార్లలో రూ.7.14 కోట్ల విలువైన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 1050.47 హెక్టార్లలో రూ. 10.29 కోట్ల విలువైన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కోతదశలోని పంటలు దెబ్బతినడంతో బాధిత రైతులు గుండెలు బాదుకుంటున్నారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

11 మండలాల్లో వర్షం



కూడేరు మండలంలో నేలకొరిగిన అరటి చెట్లను చూపుతున్న రైతు వెంకటనారాయణ

జిల్లాలోని 11 మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరులో 35.4 మి.మీ, వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ 30.0, గుమ్మఘట్ట 28.8, బ్రహ్మసముద్రం 15.0, శెట్టూరు 14.6, కణేకల్లు 13.2, డి. హిరేహాళ్ 11.8, కళ్యాణదుర్గం 8.6, కూడేరు 7.6, తాడిపత్రి 7.2, శింగనమల 4.2 మి.మీ, వర్షపాతం నమోదైంది. శుక్రవారం జిల్లాలోని పలుప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కూడేరు, బొమ్మనహాళ్, గార్లదిన్నె మండలాల్లో ఓ మోస్తారు వాన పడింది. యాడికి , గుత్తి, ఉరవకొండ మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీశాయి.

అరటి పంట నేలమట్టం

కళ్యాణదుర్గం రూరల్ మండలంలో ఈదురుగాలతో కూడిన వర్షానికి అరటితోట నేల మట్టమైంది. మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో రైతు వెంకటేశులుకు చెందిన ఐదెకరాల్లో అరటి పంట నేలమట్టమైంది. పంట చేతికొచ్చిన సమయంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు బాధిత రైతు వాపోయాడు. రూ.10 లక్షలకుపైగా పంటనష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన చెందాడు. ప్రభుత్వం పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు. అలాగే కళ్యాణదుర్గం రూరల్ పరిధిలోని మల్లికార్జునపల్లికి చెందిన రైతు బడప్పకు చెందిన ఐదెకరాల్లో మొక్కజొన్న పంట నేలమట్టమైంది. పంట కోత సమయంలో ఈదురుగాలులకు పంట పూర్తిగా దెబ్బతినడంతో రూ.4 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.



బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి వద్ద నేలకూలిన బొప్పాయి పంట

కూడేరు మండలంలో..

ఈదురు గాలులకు మండలంలో అరటి పంట నేలకొరిగింది. మామిడి తోటల్లో కాయలు రాలిపడ్డాయి. మండలంలోని చోళసముద్రం, మరుట్ల, ఎంఎంహళ్లి, కడదరకుంట, జయపురం తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి అరటి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. కోతదశలోని అరటి ఈదురుగాలులకు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు వెంకటనారాయణ సాగుచేసిన ఐదున్నర ఎకరాల్లో అరటి పంటను నాలుగు రోజుల్లో కోయాల్సి ఉండగా.. ఈదురుగాలులకు దెబ్బతింది. కడదరకుంటకు చెందిన గుడిపూటి సురేష్‌కు చెందిన మామిడితోటలో కాయలు నేలరాలడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

మామిడి నేలపాలు..

కుందుర్పి మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సారి అరకొరగా వచ్చిన దిగుబడి కూడా ఈదురుగాలులకు నేలరావడంతో బాధిత రైతుల గగ్గోలు పెడుతున్నారు.

పడిపోయిన విద్యుత్ స్తంభాలు

బ్రహ్మసముద్రం మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సానికి అరటి, బొప్పాయి, మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ప్రజలు అంధకారంలో గడపాల్సి వచ్చింది. నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సందీప్‌కు చెందిన అరటి తోట నేలకొరిగింది. సంతేకొండాపురం, తీటకల్లు, యాటకల్లు, రాయలప్పదొడ్డి గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. గుండిగానిపల్లిలో బొప్పాయి పంట నేలమట్టమైంది.

బెళుగుప్పలో..

మండలంలో గురువారం రాత్రి ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. నరసాపురంలో 50 ఎకరాలు, రమణేపల్లిలో 35 ఎకరాల్లో మొక్కజొన్న, నాలుగెకరాలల్లో అరటి, దుద్దేకుంటలో 20 ఎకరాల్లో మొక్కజొన్న, బెలుగుప్పలో పదెకరాల్లో మొక్కజొన్న, యలగలవంకలో నాలుగెకరాల్లో బొప్పాయి, గుండ్లపల్లిలో నాలుగెకరాల్లో మొక్కజొన్న, గంగవరంలో 8 ఎకరాల్లో అరటి, అంకంపల్లిలో 4 ఎకరాల్లో అరటి పంటలు దెబ్బతిన్నాయి.



రాయదుర్గం మండలంలో పడిన వడగండ్లు



కూడేరు మండలంలో నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు



బెళుగుప్ప మండలం నరసాపురంలో నేలవాలిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు రవికుమార్

ముంచిన వడగండ్ల వాన

బొమ్మనహాళ్ మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్లు నేలకూలాయి. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బొమ్మనహాళ్ మండల కేంద్రంతో పాటు శ్రీధరఘట్ట, గోనేహాళ్, దేవగిరి, ఉప్పరహాళ్, సింగానహళ్లి ఉద్దేహాళ్, లింగదహాళ్, రంగాపురం క్యాంపు గ్రామాల్లో వరి, పత్తి, అరటి, మామిడి, దానిమ్మ పంటలు దెబ్బతిన్నాయి. వడగండ్ల వాన పడటంతో వేల ఎకరాల్లో వరి ధాన్యం గింజలు రాలిపోయాయి. గోనేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లో చేతికందే దశలో వరి ధాన్యం గింజలు నేలపాలయ్యాయని బాధిత రైతులు, బలరాంరెడ్డి, జగన్నాథ్ రెడ్డి, బండూరు మల్లికార్జున, దాసరి ధనంజయ, కేశవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం

కణేకల్లు మండలంలోని పలు గ్రామాల్లో 433 హెక్టార్లల్లో వరి పంట, 231 హెక్టార్లల్లో మొక్కజొన్న, 75 హెక్టార్లలో పత్తి పంటలు దెబ్బతిన్నాయి.

రాయదుర్గంలో..

మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీగా పంటనష్టం జరిగింది. రాయదుర్గం మండలంలోని జుంజురంపల్లి, నాగిరెడ్డిపల్లి, వేపరాల, ఆవులదట్ల, వడ్రవన్నూరు, కెంచానపల్లి, కొండాపురం, వీరాపురం మరియు బాగినాయకనహళ్లి గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. మండలంవ్యాప్తంగా 220 మంది రైతులకు చెందిన 307 హెక్టార్లలో రూ.26 లక్షల విలువైన మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

ఉద్యాన పంటలకు భారీ నష్టం

రాయదుర్గం రూరల్ మండలంలోని కదరంపల్లి, ఆవులదట్ల, వేపరాల, నాగిరెడ్డిపల్లి, రేకులకుంట తదితర ప్రాంతాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలు ఈదురుగాలులకు నేలకొరిగాయి. దీంతో అపార నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. ఆవులదట్ల గ్రామానికి చెందిన రైతు ధర్మనాయక్ మామిడి తోటలో కాయలు నేలపాలయ్యాయి. అదే రైతుకు చెందిన ఫాంహౌస్ రేకులు గాలికి ఎగిరిపోయాయి. తద్వారా రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. రేకులకుంట గ్రామానికి చెందిన రైతు సీతారాంరెడ్డికి చెందిన నాలుగెకరాల్లో చీనీ మొక్కలు నేలకొరిగాయి. బొప్పాయి 37 ఎకరాలు, అరటి 17 ఎకరాలు, గుమ్మడికాయ 8 ఎకరాలు, చీనీచెట్లు మూడెకరాల్లో పంట పూర్తిగా దెబ్బతినడంతో దాదాపు రూ.35 లక్షల వరకు పంటనష్టం వాటిలినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



కణేకల్లులో దెబ్బతిన్న వరిపంట



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు



బాలికపై అత్యాచారం



ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

నార్పల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పన్నెండేళ్ల బాలికపై శుక్రవారం సాయంత్రం మహేష్ అనే యువకుడు అత్యాచారం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు, బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన మహేష్. గొర్రెల ఎరువు కోసం నార్పలకు వచ్చాడు. ఆ ఇంటి వద్ద బాలిక ఒంటరిగా ఆడుకుంటూ కనిపించింది. దీంతో బలవంతంగా ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు తన తాతకు ఫోన్ చేసి సమాచారం తెలియజేసింది. కుటుంబ సభ్యులు బాలికను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మహేష్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బంగారం వ్యాపారి ఆత్మహత్య

పోలీస్ స్టేషన్ ఎదుట రసాయనం తాగిన గౌసుల్లా

తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేయడంతో వివాదం



గౌసుల్లా (ఫైల్)

తాడిపత్రి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బంగారం దుకాణ నిర్వాహకుడు గౌసుల్లా(46) శుక్రవారం రసాయనం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేసిన వివాదంలో పోలీసులు, మరికొందరు వేధించడంతో గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలో మహమ్మద్ రఫీ అనే వ్యక్తి పది తులాల బంగారాన్ని తాకట్టుపెట్టి 2023 డిసెంబరులో రుణం తీసుకున్నాడు. దీనికి అదే కంపెనీలో పనిచేస్తున్న అతని స్నేహితుడు జిలాన్‌బాషా సాయం చేశాడు. ఆ తరువాత రఫీకి తెలియకుండా తాకట్టు బంగారాన్ని జిలాన్ బాషా అమ్మేశాడు. 'వేలానికి వచ్చిన బంగారం.. తక్కువ ధరకు ఇప్పిస్తా' అని చెప్పి గౌసుల్లాకు విక్రయించాడు. సరిగ్గా ఏడాది తరువాత తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు జిలాన్ బాషాను రఫీ సంప్రదించాడు. అతను స్పందించకుండా కాలం గడిపి, రెండు నెలల క్రితం ఊరు విడిచి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానే గాలించి, బళ్లారిలో ఉన్న జిలాన్‌బాషాను పట్టుకువచ్చి రెండు రోజుల క్రితం పోలీసులకు అప్పగించాడు. బంగారాన్ని గౌసుల్లాకు విక్రయించానని జిలాన్‌బాషా చెప్పడంతో పోలీసులు గౌసుల్లాను పిలిపించారు. వేలంలో అమ్ముతున్నారని జిలాన్ చెప్పడంతో తాను మూడు తులాల బంగారాన్ని కొనుగోలు చేశానని, డబ్బులు అప్పుడే చెల్లించానని గౌసుల్లా పోలీసులకు తెలిపాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా గౌసుల్లాను పోలీసులు స్టేషన్‌కు పిలిపించడం, గౌసుల్లా ఇంటి వద్దకు మహమ్మద్ రఫీ, పోలీసులు వెళ్లడం వంటి సంఘటనలు జరిగాయి. ఎస్ఐ గౌస్‌బాషా శుక్రవారం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించారు. పది తులాల బంగారంతో తనకు సంబంధం లేదని, కొన్నది మూడు తులాలేనని, డబ్బులు కూడా ఇచ్చేశానని గౌసుల్లా చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. ఏదైనా ఉంటే బయటకు వెళ్లి మాట్లాడుకోవాలని ఎస్ఐ సూచించారు. దీంతో స్టేషన్ బయటకు వెళ్లిన గౌసుల్లా.. తన ద్విచక్రవాహనంలో ఉన్న రసాయనం బాటిల్‌ను తీసుకుని తాగేశాడు. వెంటనే పోలీసులు, స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌసుల్లా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతని బంధువులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసుల వేధింపుల కారణంగానే గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌసుల్లాకు భార్య తస్లీమ్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గౌసుల్లా కుమారుడు నజీరుద్దీన్ ఫిర్యాదు మేరకు మహమ్మద్ రఫీ, అతని తమ్ముడు హాజీ, జిలాన్ బాషాపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



తాడిపత్రి పోలీస్ స్టేషన్ వద్ద గౌసుల్లా కుటుంబ సభ్యులు, బంధువులు

మట్టి పెల్లలు విరిగిపడి ముగ్గురు చిన్నారుల మృతి..?

మలయనూరు చెరువులో అనుమానాస్పద ఘటన

బాధితులు బొగ్గులు కాల్చే మహారాష్ట్ర కుటుంబాలు

గుట్టుచప్పుడు కాకుండా తరలించిన ఏజెంట్..?

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు



మహారాష్ట్ర కూలీలను విచారిస్తున్న ఎస్ఐ నగేష్

కుందుర్పి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలయనూరు సమీపంలో మట్టి పెల్లలు విరిగిపడి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని విశ్వసనీయంగా తెలిసింది. గ్రామ సమీపంలోని చెరువులో మహారాష్ట్రకు చెందిన 15 కుటుంబాలు బొగ్గులు కాల్చే పని చేస్తున్నారు. కొన్ని నెలలుగా వారు అక్కడే గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. పెద్దలు గురువారం పనిలో నిమగ్నమై ఉండగా, చిన్నారులు ఆడుకునేందుకు చెరువులోని గుంతల్లోకి వెళ్లారని, వారిపై మట్టి పెల్లలు విరిగిపడ్డాయని తెలిసింది. మట్టిలో కూరుకుపోయిన జ్యోతి (14), మార్వత్(10), అనీత్(9) మృతిచెందారని, బార్క్(11) అనే చిన్నారి తీవ్రంగా గాయపడ్డారని తెలిసింది. చెరువులో ఇసుక తవ్వకాల కారణంగా ఏర్పడిన గోతులే ప్రమాదానికి కారణమని తెలిసింది. శ్రీకాంత్ రాథోడ్ అనే బొగ్గుల ప్రధాన ఏజెంట్ మహారాష్ట్ర నుంచి ఆ కుటుంబాలను ఇక్కడికి తీసుకువచ్చి పని కల్పించారని సమాచారం. మృతి చెందిన ముగ్గురు చిన్నారులు విలాస్ అనే వ్యక్తి సంతానమని తెలిసింది. విషయం తెలుసుకున్న ప్రధాన ఏజెంట్, బాధిత కుటుంబాలను, చిన్నారుల మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా సొంత వాహనంలో మహారాష్ట్రకు తీసుకెళ్లినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడ్డ చిన్నారి బార్క్(11)ను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రితో చేర్పించారని తెలిసింది. విషయం తెలుసుకున్న మలయనూరు గ్రామస్థులు, పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు. అక్కడున్నవారు సరైన సమాచారం ఇవ్వలేదు. ఎస్ఐ నగేష్ తమ సిబ్బందితో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్న ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. బొగ్గులు కాల్చే పనిలో ఉన్న కూలీలను విచారించారు. ఎవరి నుంచీ సరైన సమాచారం లభించడం లేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ నగేష్ తెలిపారు.



ప్రమాదం జరిగినట్లు భావిస్తున్న ప్రాంతం

అనంతపురం ఫైనాన్షియల్ హబ్‌గా ఎదగాలి

జోయాలుకాస్ జ్యుయలర్స్ ప్రారంభోత్సవంలో వక్తలు



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఫైనాన్షియల్ హబ్‌గా అభివృద్ధి చెందాలని వక్తలు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని రాజు రోడ్డులో జోయాలుకాస్ జ్యువెలర్స్ 102వ షోరూమ్‌ను శుక్రవారం వారు అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, జోయాలుకాస్ ఎండీ, సీఈఓ జోయాలుకాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకీ జిల్లాలో పెద్ద పెద్ద కంపెనీలకు చెందిన షాపింగ్‌మాల్స్ పెరుగుతున్నాయని, ఇదే పంథాల్లో జిల్లా ఫైనాన్షియల్ హబ్‌గా ఎదిగి, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. ఎండీ జోయాలుకాస్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జ్యువెలరీ జోయాలుకాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే అనంతపురంలో ఒక షోరూమ్ ఉందని, ఇపుడు రెండో షోరూమ్‌ను ప్రారంభించామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కలిగిన అనేక రకాల ఆభరణాలను ఈ షోరూమ్‌లో అందుబాటులో ఉంచామని అన్నారు. వెండి, బంగారం, వజ్రాలలో అధునాతన ఆభరణ శ్రేణి తమ వద్ద లభిస్తాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో ఆభరణాలను విక్రయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జోయాలుకాస్ సంస్థ ఈడీలు ఆంటోని జోస్, థామస్ మాథివ్, హెన్రీ జార్జ్ తదితరులు పాల్గొన్నారు.


షోరూంలో అతిథులు



హంద్రీనీవాకు లైనింగ్ తగదు

వెడల్పు చేయాలి

6 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో సమాంతర కాలువ తవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కింద కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరిచ్చిన తర్వాత, అవసరమైతే మిగతా కాలువకు లైనింగ్ చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ పేర్కొన్నారు. మండలంలోని జీ కొట్టాల వద్ద హంద్రీనీవా వెడల్పు పనులను శుక్రవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. హంద్రీనీవా రెండో దశ కాలువను వెడల్పు చేయకుండా లైనింగ్ చేయాలని నిర్ణయించడం సబబుకాదన్నారు. లైనింగ్ చేస్తే భూగర్భ జలాలు అడుగంటి, రైతులు నష్టపోతారన్నారు. హంద్రీనీవా వైడెనింగ్ చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. లైనింగ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. హంద్రీనీవా 1, 2 దశల కాలువ కింద నీరివ్వడంతో పాటు జీబీసీ పరిధిలోని ఉపకాలువల ఆయకట్టుకు, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువులకు నీరివ్వాలని కోరారు. కాలువలో 3,800 క్యూసెక్కుల ప్రవాహంతో నీరు పూర్తిస్థాయిలో ఇవ్వడం సాధ్యం కాదన్నారు. కాలువ సామర్థ్యాన్ని మరో వెయ్యి క్యూసెక్కులకు పెంచాలనీ, 6 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో సమాంతర కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో హంద్రీనీవా పిల్ల కాలువల నిర్మాణం పూర్తిచేసి, ఆయకట్టును అభివృద్ధి పరచి నీరివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, దేవేంద్ర, దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.


హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నేడే ఇంటర్ ఫలితాలు

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ

మనమిత్ర నంబర్ ద్వారా వాట్సాప్‌కు ఫలితాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలు శనివారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. గతనెల 1 నుంచి 15వతేదీ వరకూ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 63 పరీక్షా కేంద్రాలకు 48,690 మంది విద్యార్థులను కేటాయించారు. మొదటి ఏడాది 25,730 మంది, రెండో ఏడాది 22,960 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో చాలామంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల తర్వాత ఫలితాలు అందుబాటులో ఉంటాయని బోర్డు ప్రకటించింది. విద్యార్థులు తమ ఫలితాలను http://results-bie.ap.gov.in వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు. మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు హాయ్ అని మెసేజ్ చేసి, ఫలితాలు పొందవచ్చునని బోర్డు ప్రకటించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

చీనీకాయలు టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,200, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1406 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

ఈ- శ్రమ్‌లో నమోదు చేయండి

కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. దీనిపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ.. జిల్లాలో అర్హత గల అన్నిరంగాల కార్మికులను ఈ పోర్టల్ నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు ఈకార్మికులకు అందేలా చూడాలన్నారు. ఉపాధికూలీలు, అంగన్‌వాడీ వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్లాన్ అప్రూవల్ అథారిటీలందరూ ప్రతినిర్మాణంపై మొత్తం వ్యయంలో ఒకశాతం సెస్ వసూలు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు. బాలకార్మికుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంత భేష్..!

సొసైటీల కంప్యూటరీకరణలో ఉమ్మడి జిల్లాకు ద్వితీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సొసైటీల కంప్యూటరీకరణలో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. 108 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీ) కంప్యూటరీకరణ పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి శుక్రవారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివ నారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సొసైటీలను బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సహకార శాఖాధికారులు అరుణకుమారి, కృష్ణానాయక్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణిని అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌సీఓ ప్రభాకర్ రెడ్డి, సహకార శాఖ, ఏడీసీసీ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను సన్మానిస్తున్న డీసీఓ, సీఈఓ

రైతు కష్టాన్ని కాజేశారు

కందుల డబ్బు సైబర్ నేరగాళ్ల పాలు

బెళుగుప్ప, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతు కష్టాన్ని సైబర్ నేరగాళ్లు కాజేశారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మగా వచ్చిన సొమ్మును అప్పనంగా దోచేశారు. మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు నిర్మలమ్మ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు ఈనెల 9న మూడు విడతల్లో రూ.99,400 కాజేశారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆమె ఫిర్యాదు చేశారు. రైతు పండించిన 17 క్వింటాళ్ల కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. అందుకు సంబంధించిన డబ్బు ఈనెల 9వ తేదీన రాత్రి ఆమె బ్యాంకు ఖాతాకు జమైంది. ఆ రాత్రే ఓ ఆమె ఫోన్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి మెసేజ్ వచ్చింది. అదేదో తెలియని ఆమె దానిపై క్లిక్ చేసింది. అంతే.. ఆ తరువాత మూడు విడతల్లో రూ.24,500, రూ. 24,900, రూ.50వేలు మొత్తంగా రూ.99,400 సైబర్ నేరగాళ్లు కాజేశారు. విషయం తెలియని మహిళా రైతు ఈనెల 10న ఉదయం డబ్బు డ్రా చేసుకునేందుకు బ్యాంకుకెళ్లారు. అక్కడ విషయం తెలిసింది. దీనిపై బాధితురాలు.. సైబర్ సెల్ 1930 నంబర్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.


బాధిత రైతు నిర్మల

10న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మే 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో ఈ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తారన్నారు. మోటారు వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు కాకుం డా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసు లు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ టాక్స్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తామన్నారు. కక్షిదారులందరూ జాతీయయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని తెలిపారు.
ఆర్థిక అవకతవకలపై నివేదిక ఇవ్వండి

అవకతవకలపై నివేదికలు ఇవ్వాలి

ఆడిటర్లకు డీసీఓ ఆదేశాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు, సొసైటీల్లో ఆర్థిక వ్యవహారాలను నిశితంగా పరిశీలించి, అవకతవకలపై నివేదిక ఇవ్వాలని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి.. ఆడిటర్లను ఆదేశించారు. సొసైటీల కంప్యూటరీకరణ, ఆన్‌లైన్ లావాదేవీలు, ఆడిట్‌పై శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్ ఆవరణలోని డీసీఏఓ కార్యాలయంలో డీసీఓ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సొసైటీల ఆడిట్ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని సూచించారు. సహకార సంఘాల్లో ప్రతి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి, అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీఎల్ఓ ప్రభాకర్ రెడ్డి, సహకార శాఖ ఆడిటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీఓ అరుణకుమారి





న్యూస్ బాక్స్


ధర్మవరం: ఉపకరణాలను అందజేస్తున్న ఎంఈఓలు

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

ధర్మవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్న కేశవపురంలోని భవిత కేంద్రంలోని దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసిన ఉపకరణాలను ఎంఈఓ-1 రాజేశ్వరీదేవి, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ అందజేశారు. ఐదుగురు పిల్లలకు వినికిడి, రొలేటర్స్, వీల్‌చైర్స్ శుక్రవారం ఎంఈఓలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగప్ప, ఐఈఆర్‌పీలు సరస్వతి, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు:స్థానిక భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్స్, విద్యాసామగ్రిని ఎంఈఓ సురేష్‌బాబు శుక్రవారం అందజేశారు. ఇందులో హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నరసింహబాబు, నాగశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జయంత్యుత్సవం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు ఆధ్వర్యంలో అయ్యప్ప జయంత్యుత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి.. పూజలు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత మండల కో-ఆర్డినేటర్ వెంకటరమణనాయక్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ లీడర్ నిజాం, మీసేవ సుధాకర్, కర్ల సుమంత్, శివాలయ నిర్మాణ దాత మహమ్మద్ రఫీ, మంజునాథ్, రఘు పాల్గొన్నారు.

కలుషిత నీటి నివారణకు చర్యలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్ఎన్ఎల్ టవర్, చెరువు ప్రాంతం ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోండటంతో వారు బుధవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించిన విషయం తెల్సిందే. కలుషిత నీరు వస్తున్న బోరు నుంచి కాకుండా ఎస్సీ కాలనీలోని బోరు నుంచి ఆ ప్రాంతాల వారికి నీరు సరఫరా అయ్యేలా ఎంపీడీఓ రాబర్టువిల్సన్, ఈఓఆర్డీ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ గోవిందు, కార్యదర్శి శ్రీకాంత్ చర్యలు చేపట్టారు. దీంతో శుక్రవారం నుంచి వారికి మంచి నీరు సరఫరా చేశారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

ధర్మవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి థియేటర్ సమీపంలో గుడిబండ వెంకటేశ్ అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న తారక్ చేయూత ట్రస్ట్ సభ్యులు విషయాన్ని చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకుడు సంధారాఘవ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అంత్యక్రియల కోసం రూ.8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ నగదును తారక్ చేయూత ట్రస్టు సభ్యులు వెంకటేశ్ భార్య లక్ష్మీదేవికి అందజేశారు.

క్షయవ్యాధిపై అవగాహన

బుక్కపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాముదుర్తి గ్రామంలో క్షయ, టీబీ వ్యాధులపై గ్రామస్థులకు హెల్త్ ఎడ్యుకేటర్ రామన్న శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హబీబ్ బాషా, వైద్య సిబ్బంది కీర్తి, సవిత, కమలాకర్, హరిత పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి


మురళి (ఫైల్)

నంబులపూలకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటిబైలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు మురళి (48) అనారోగ్యంతో మరణించాడు. ఆయన స్వగ్రామం తలుపుల మండలంలోని బండ్లపల్లి. శుక్రవారం తెల్లవారుజామున స్వగ్రామంలోని ఇంట్లో అతను మరణించాడు. ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు శాంతమ్మ, ఉపాధ్యాయులు ఆ గ్రామానికి వెళ్లి మృతుడికి నివాళులర్పించారు. కాగా, మురళికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లిలో వారం నుంచి గ్రామంలో నీటి సమస్య నెలకొంది. అలాగే వీధి దీపాలూ వెలగడంలేదు. ఈ సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామస్థులు సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామమోహన్, జగన్మోహన్, ముస్తాక్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలని కదిరి పట్టణ బలిజ సేవ సంఘం అధ్యక్షుడు కునక పుల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రాయల పాలన నేటికీ ఆదర్శమని, తెలుగు భాష అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు.

భూసార పరీక్షలపై అవగాహన

బత్తలపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ క్రిష్ణయ్య రైతులకు భూసార పరీక్షలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతి రైతు తప్పకుండా తమ భూములకు భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం అధికారి శ్రీనాథ్ ఏఓ ఓబిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయండి

ముదిగుబ్బ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం స్థానిక ఆయన విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సాకే రంగనాయకులు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాలు, ప్రజా సంఘాలు, కవులు, కళాకారులు, అన్ని పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్ పుస్తకాల అందజేత

తనకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగోవిందు నరసింహారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీచేశారు. ఇందులో ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: అమడగూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను శుక్రవారం అందజేశారు. ఇందులో ప్రిన్సిపల్ ప్రభాకర్ అధ్యాపకులు పాల్గొన్నారు.


తనకల్లు: ఇంటర్ పుస్తకాలతో విద్యార్థులు

ఆ పంచాయతే వద్దు స్వామి..!

- సెక్రటరీగా కొత్తచెరువుకు వచ్చేందుకు జంకుతున్న ఉద్యోగులు
- ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న ఉన్నతాధికారులు
- అస్తవ్యస్తంగా పాలన
- కుంటుపడిన అభివృద్ధి



కొత్తచెరువు మేజర్ పంచాయతీ కార్యాలయం

కొత్తచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మేజర్ పంచాయతీ సెక్రటరీగా పనిచేసేందుకు ఉద్యోగులు జంకుతున్నారు. ఈ పంచాయతీలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఎవరికి తోచిన విధంగా వారు పంచాయతీ సొమ్ము కాజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీకి చెందిన డిపాజిట్ డీడీలను వాడుకున్నారు. దీంతో ఉన్నతాధికారులు ఆయనపై విచారణ జరిపి నివేదికను పంచాయతీ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించారు. ఆ సెక్రటరీకి ఉన్నతాధికారుల అండదండలు ఉండటంతో.. అనంతపురం జిల్లాకు బదిలీ చేయించుకున్నారు. ఆయన స్థానంలో శ్రీనివాసరెడ్డి ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆయన కూడా అనారోగ్య కారణంగా సెలవులో ఉన్నాడు. దీంతో ఉన్నతాధికారులు తలమర్ల సెక్రటరీ రాంగోపాల్‌రెడ్డిని కొత్తచెరువు మేజర్ పంచాయతీకి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆయన ఇటీవల జరిగిన వేలం పాటలో జరిగిన గందరగోళం చూసి బయపడి తాను ఈ పంచాయతీ సెక్రటరీగా పనిచేయలేనని ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో ఆయన స్థానంలో బండ్లపల్లి పంచాయతీ సెక్రటరీ నాగరాజును ఇన్‌చార్జిగా శుక్రవారం నియమించారు. ఇలా కొత్తచెరువు మేజర్ పంచాయతీకి రెగ్యులర్ సెక్రటరీ లేక... ఇన్‌చార్జీల పాలనలో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

ఇన్‌చార్జి సెక్రటరీగా నాగరాజు

కొత్తచెరువు మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీగా బండ్లపల్లి పంచాయతీ సెక్రటరీ నాగరాజును నియమిం చినట్లు డీఎల్‌పీఓ కృష్ణారెడ్డి తెలిపారు. ఇన్‌చార్జ్ సెక్రటరీగా పనిచేస్తున్న రాంగోపాల్‌రెడ్డి ఇప్పటికే మూడు పంచాయతీలకు ఇన్‌చార్జ్‌గా ఉన్నాడని, పనిఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఆ స్థానంలో నాగరాజును నియమించినట్టు తెలిపారు.


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా సీతారాముల కల్యాణం

ముదిగుబ్బ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న సందర్భంగా ఏటాలాగే ఈసారి కూడా శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు బాల రంగాచార్యులు, నరసింహాచార్యులు, లోకరామ్ చార్యులు ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ ప్రాంగణానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు నామ రాంప్రసాద్ దంపతులు అన్నసంతర్పణ చేశారు.

బుక్కపట్నంలో శ్రీవారికి ..


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

బుక్కపట్నం, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి వారికి శ్రీదేవి, భూదేవితో కల్యాణోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు హరిస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్వామి, అమ్మవారులు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐరావతంపై శ్రీవారు



తాడిమర్రి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీతారమ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని ఐరావతం (తెల్లఏనుగు) వాహనంపై ఊరేగించారు. మొదట శ్రీదేవి, భూదేవి సమేతులైన స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


బెస్ట్ ప్లేయర్ అవార్డు అందిస్తున్న ఎస్ఐ

బత్తలపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో పోలీసులు, పాత్రికేయుల మధ్య శుక్రవారం క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. పాత్రికేయుల జట్టుకు అజయ్, పోలీస్ జట్టుకు సుదర్శన్ ప్రాతినిధ్యం వహించారు. టాస్ గెలిచిన పాత్రికేయుల జట్టు మొదట బ్యాటింగ్ చేసి .. 10 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 78 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు 9.3 ఓవర్లలోనే ఎనిమిది వికెట్లు నష్టపోయి 79 పరుగులు చేసి విజయం సాధించింది. పాత్రికేయుల జట్టులో వెంకట దర్శన్, పోలీస్ జట్టులో సుదర్శన్‌కు బెస్ట్ ప్లేయర్ అవార్డులను ఎస్ఐ సోమశేఖర్ అందజేశారు.

డిజైన్ థింకింగ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర పరిధిలోని బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో విద్యార్థులకు రెజ్యూమ్ బిల్డింగ్, డిజైన్ థింకింగ్‌పై బిజినెస్ సొల్యూషన్స్ ఆఫ్ బ్రిలియో ప్రతినిధులు రీతూశర్మ, శాంభవి అవగాహన కల్పించారు. వృత్తిపరమైన వృద్ధికి ఇవి ఏవిధంగా ఉపకరిస్తాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చీకటిమానుపల్లిలో 'పోషణ పక్వాడ్'

తనకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లిలో ఘనంగా పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నల్లచెరువు సీడీపీఓ జయంతి మాట్లాడుతూ.. ఈనెల 8 నుంచి 22 వరకు రాష్ట్ర, జిల్లా, మండల గ్రామస్థాయిల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ శాఖ సమన్వయంతో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సక్షం అంగన్‌వాడీ కేంద్రాల్లో పురుగుమందులు లేకుండా స్వయంగా పండించిన ఆకుకూరలు, కూరగాయాలను గర్భవతులు, బాలింతలకు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి రూ.5.70 కోట్లు

నల్లమాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి రూ.5,70,88,000 నిధులు మంజూరైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్ శుక్రవారం తెలిపారు. తరగతుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, డైనింగ్ హాల్, వసతి గృహం నిర్మాణాలకు రూ.3,20,88,000, పాఠశాల సిబ్బంది వసతి సముదాయం నిర్మాణానికి రూ.90 లక్షలు, ఫర్నీచర్‌కు రూ. పది లక్షలు, ప్రస్తుతమున్న పాఠశాల మరమ్మతులకు రూ.30 లక్షలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు.

జగన్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి: బీజేపీ


ఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పోలీసుల ఆత్మస్థైర్యం, గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యానించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మలాకిశోర్, నాయకులు ఎస్పీ వీ.రత్నకు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గీతామాధురి, ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, సౌభాగ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు మంజుల, రాష్ట్ర కల్లుగీతకార్మిక ఫౌండేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, మీడియా కన్వీనర్ జ్యోతిప్రసాద్, కోశాధికారి సురేంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్, నాయకులు నారాయణ, రామాంజినేయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ధర్మవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వే నెంబర్ 650-2లో దొంగపట్టాలతో అనధికారికంగా నిర్మాణం చేపడుతున్న వాటిని తొలగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ కార్మికులు స్థానిక కాలేజ్ సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముసుగు మధు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జింకా చలపతి మాట్లాడారు. అక్కడ చాలా మంది నకిలీ పట్టాలతో ఇంటి నిర్మాణాలు చేపట్టినట్లు తహసీల్దార్ కూడా స్పష్టం చేశారని, ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించి .. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, ప్లంబర్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కాటమయ్య పాల్గొన్నారు.

చెరువు కట్ట రాళ్లు, మట్టి తరలించే యత్నం


చెరువుకట్ట రాళ్లు, మట్టిని తొలగిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బుక్కపట్నం చెరువు కట్టకు ఉన్న మట్టి, రాళ్లను స్థానిక రైతు పోలన్నగారి రవీంద్ర ఎక్స్‌కవేటర్ సాయంతో తన పొలంలోకి తర లించేందుకు శుక్రవారం ప్రయత్నించారు. దీంతో అక్కడే ఉన్న సాగునీటి సంఘం డైరెక్టర్లు పత్తిపాటి మధు, అప్పకొండప్పగారి చలపతి అడ్డుకొని.. నిలదీశారు. దీంతో ఆ రైతు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇరిగేషన్ అధికారులు చెరువుకట్ట భద్రతపై ఎప్పకప్పుడు పరిశీలించడమే కాకుండా చెరువులోకి వృథా మట్టిని తొలుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం


ధర్మవరం: ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

ధర్మవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి జెండా ఆవిష్కరించారు. ఇందులో ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్‌హెచ్ బాషా, వెంకటస్వామి, హరి, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, నాయకులు అయాబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలీ, రైతులు శంకర ఆది, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: ఏపీ రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఇందులో నాయకులు సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, ఆంజనేయులు, రవీ, రామమోహన్ పాల్గొన్నారు.

పంట నష్టపోతున్నాం.. ఆదుకోండి..

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులతో తాము పంటనష్టపోతున్నామని, తమను ఆదుకోవాలని మండలంలోని చెరువుమునెప్పగారిపల్లికి చెందిన జగన్నాథరెడ్డి, నారాయణరెడ్డి, నాయనకోట తండాకు చెందిన శంకర్‌నాయక్ కోరుతున్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. తమ పంట పొలాల వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే వారు క్రషర్ మిషన్ పెట్టారని, దీంతో దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతిన్నాయని వాపోయారు. గతంలో పరిహారం ఇస్తామన్న గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు.. ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. వందల ఎకరాల్లో మామిడి పంట పండక రూ.లక్షల్లో నష్టపోయినట్లు వాపోయారు.

జ్యోతిబా పూలేకి ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, బీసీ ఉద్యోగ సంఘం నాయకులు, బీసీ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కదిరిలో ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ పూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు.


కదిరిలో పూలే విగ్రహం వద్ద ఎమ్మెల్యే కందికుంట నివాళి


కదిరిలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..



ధర్మవరంలో బీసీ సంఘం నాయకులు


బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో..


తలుపులలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు


నల్లమాడలో టీడీపీ నాయకులు..


ఓడీసీలో ఎంపీడీఓ, బీజేపీ నాయకుల నివాళి

క్రైం న్యూస్..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గాండ్లపెంట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీ నీరుకుంట్లపల్లి వద్ద ఈనెల ఒకటో తేదీన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నరసప్పగారిపల్లికి చెందిన రెడ్డిశేఖర్ (32) పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. కోలుకోలేక శుక్రవారం అతను మరణించాడు. రెడ్డిశేఖర్ అవివాహితుడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రామమోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రం జాతీయ రహదారి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎర్రదొడ్డికి చెందిన దంపతులు అశోక్, అమృత నల్లమాడకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. కాళసముద్రం వద్ద అనంతపురం నుంచి వస్తున్న కారు ఢీకొంది. గాయపడ్డ ఆ దంపతులను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాటుసారా తయారీదారుల అరెస్ట్

ధర్మవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయనపల్లి తండా సమీపంలో నాటుసారా తయారీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ చంద్రమణి తెలిపారు. వారి నుంచి ఎనిమిది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని, తెల్లని బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, అనంతపురం ఈఎన్‌ఎఫ్‌టీ ఇన్‌స్పెక్టర్ సునంత, ఎస్ఐలు చాంద్‌బాషా, నాగరాజు, రూరల్‌ఏఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి

గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం

ధర్మవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలోనే చేరాలని.. నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని.. స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల అధ్యాపకులు కోరుతున్నారు. ఈ మేరకు అధ్యాపకులు రామాంజనరెడ్డి, పెద్దన్న, మల్లికార్జున, హాజీపీరా, ఈక్రంబాషా, ప్రభాకర్ చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం, కనుమక్కుల, చిన్నపరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో చేరితే మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు.. తదితర సౌకర్యాలు అభిస్తాయని, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మంచి ఉత్తీర్ణత శాతం వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.


చిన్నపరెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

న్యూస్ బాక్స్

భూముల సేకరణపై సమీక్ష



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఇటీవల మడకశిర నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశారు. మందుగుండు సామగ్రి పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో గౌడనహళ్లి, జమ్మానపల్లి, ఆర్.అనంతపురం గ్రామాల పరిధిలో మరికొన్ని భూములను సేకరించనున్నారు. అందులోభాగంగా శుక్రవారం టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆర్ఐ, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమై చర్చించారు. అందుకు సంబంధించిన భూములను సేకరించే విషయంలో జిల్లా స్థాయి అధికారులు సైతం సమీక్షలు నిర్వహించారు. భూముల సేకరణ విషయమై చర్చించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, ఆర్ఐ సోమశేఖర్, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

కారణజన్ముడు అయ్యప్ప

- మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కారణ జన్ముడని అయ్యప్పస్వామి అని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌కుమార్, హిందూపురం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, సురేంద్ర, శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలోని అయ్యప్ప జయంతికి వారు ముఖ్య అతిథితులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం అయ్యప్ప అవతరించాడని వివరించారు. ఆయన చల్లని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడు నిండుగా మెండుగా ఉండాలని కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పల్లా లక్ష్మీకుమార్, ఆలయ అధ్యక్షుడు పురడి మంజునాథ్, గురుస్వామి సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు ఆదినారాయణ, హరీష్‌కుమార్, చంద్ర, నాగేంద్ర, చంద్రమోహన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

గోరంట్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో శుక్రవారం రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. బూడిదగడ్డపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు కోట్లో శేషాద్రిరెడ్డి విగ్రహాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, వీరనారాయణరెడ్డి, ఎస్సీ, ఎస్టీ ప్రజాసమాఖ్య జిల్లా అధ్యక్షుడు కెఎన్ బాబు, జిల్లా ఇన్‌చార్జి తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెనుకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి, వ్యాప్తిపై వైద్యుడు ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక క్షయవ్యాధి కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయ్‌కిరణ్ వ్యాధి లక్షణాలను, ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది తదితర విషయాలను వెల్లడించారు. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లతోపాటు రక్తం పడటం, రాత్రిపూట, సాయంత్రం జ్వరం రావడం, చమటలు పట్టడం, బరువుతగ్గడం, ఆకలితగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్లపరీక్షను నిర్వహించుకోవాలన్నారు. మందులు వాడాలన్నారు. అనంతరం క్షయవ్యాధి సోకినవారి సమీప బంధువులకు, స్నేహితులకు చర్మ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది శశిధర్, రెడ్డప్ప పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొళ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేవీ రొళ్ల, రత్నగిరి, బి.జి.హళ్లి, రామనపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నిజాముద్దీన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడిబండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.29,100 నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి అరెస్టు కేసును నమోదు చేసినట్లు వివరించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

సోమందేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ స్థాపనదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు బాలంపల్లి మంజునాథ్, సీనియర్ నాయకులు పూజారి అంజినప్ప, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సోమశేఖర్, నిమ్మకాయల ప్రసాద్, అంజినప్ప పాల్గొన్నారు.

కష్టపడ్డవారికే పార్టీ పదవులు

టీడీపీ పట్టణాధ్యక్షుడి పదవి పేర్ల నమోదులో నాయకులు



సమావేశమైన నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికే పార్టీ పదవుల్లో అవకాశాలు ఉంటాయని టీడీపీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంవద్ద టీడీపీ పట్టణాధ్యక్ష పదవి కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. 11మంది నాయకులు పట్టణ కన్వీనర్ కావాలంటూ కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీలో కార్యకర్త నుంచి ఎమ్మెల్యే అయినవారు చాలా మంది ఉన్నారని, ఈ పార్టీ క్రమశిక్షణకు మారుపేరని అందుచేతనే కష్టకాలంలో పార్టీకోసం శ్రమించినవారికి పదవులు వస్తాయన్నారు. అయితే పట్టణ కన్వీనర్ పదవి ఒకటే ఉంటుందని, పలువురు పదవి కావాలని ఆశ ఉన్నా ఒకరికే అవకాశం ఉంటుందని మిగిలినవారు పదవి రాలేదని బాధపడాల్సిన అవసరం లేదన్నారు. వారికి మరోరకంగా న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షునితోపాటు మునిసిపల్ చైర్మన్ కూడా సామాన్య కార్యకర్తనుంచి వచ్చినవాడేనన్నారు. దీనినిబట్టి పదవులు కష్టపడినవారికే దక్కుతాయన్నారు. మునిసిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ పార్టీ పట్టణాధ్యక్ష పదవి ముళ్ల కిరీటం లాంటిదని ఆ పదవి కావాలని అందరికీ ఆశ ఉండవచ్చునన్నారు. అయితే పార్టీ పదవి చేపట్టాక వచ్చే ఇబ్బందులుకూడా ఎదుర్కొనే ఓపిక ఉండాలన్నారు. మాజీ మునిసిపల్ చైర్మన్ అనీల్‌కుమార్, సీనియర్ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ ఆశావహుల పేర్లు తీసుకుని ఎమ్మెల్యేకు పంపడం జరుగుతుందని అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడిని కన్వీనర్‌గా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అయితే నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే సూచించే వ్యక్తికి సహకరించాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు షఫీ, పరిమళ, మంగేష్, ప్రెస్ వెంకటేశ్, చంద్రమోహన్, రఘు, నవీన్, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణోత్సవం జరిపిస్తున్న వేదపండితులు



కల్యాణానికి హాజరైన భక్తులు

కల్యాణం.. కమనీయం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దండురోడ్డులో ఉన్న 27 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఒంటిమిట్టలో శుక్రవారం సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ముహూర్తానికి పురంలో కూడా కల్యాణం చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం జరిగిన కల్యాణంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం కనువిందుగా సాగింది. ఈ సందర్భంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను వివిధ పూలు, నగలతో సర్వాంగసుందరంగా అలంకరణ చేశారు.

విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు

- డీవైఈఓ పద్మప్రియ



విద్యార్థినులతో వివరాలు సేకరిస్తున్న డీవైఈఓ పద్మప్రియ

గుడిబండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పిసి గిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని పెనుకొండ డీవైఈఓ పద్మప్రియ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వారం రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ఉపాధ్యాయుల రచ్చ రచ్చ అనే శీర్షికన కథనం ప్రచురితం అయింది. కలెక్టర్ చేతన్‌కుమార్, డీఈఓ స్పందించి పెనుకొండ డీవైఈఓ పద్మప్రియను విచారణ అధికారిగా నియమించారు. ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయుల మధ్య గొడవలు చోటుచేసుకొని జిల్లా స్థాయికి వెళ్లడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకొని విచారణకు ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు డీవైఈఓ తెలిపారు. ఉపాధ్యాయులు విధులను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల కృషి చేయాలని ఉపాధ్యాయులు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో వివరాలను అడిగి తెలుసుకొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు



డిపో ఆవరణలో నిరసన తెలుపుతున్న నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసేవారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత కల్పించి 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలన్నారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే కల్పించాలన్నారు. గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. 114జీఓ ప్రకారం నైట్ అలవెన్స్‌లు, 150నుంచి రూ.400 చెల్లించాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ జాయింట్ కార్యదర్శి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు వలీసాబ్, డిపో అధ్యక్షులు రంగనాథ్, కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

రేషన్ కోసం లబ్ధిదారుల పడిగాపులు



రేషన్‌షాపు వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

గుడిబండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో శుక్రవారం 22వ షాపులో రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు పడికాపులు కాశారు. ఉదయం నుంచి షాపుల వద్ద లబ్ధిదారులు ఉన్నా డీలర్లు కన్నెత్తిచూడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సక్రమంగా రేషన్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులకు కోరుతున్నారు.

నేరాలకు దూరంగా ఉండండి: సీఐ



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ జనార్దన్

చిలమత్తూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నేరాలకు దూరంగా ఉండి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించుకోవాలని హిందూపురం రూరల్ సీఐ జనార్ధన్, ఎస్ఐ మునీర్ అహమ్మద్ గ్రామస్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని హుసేన్‌పురంలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. గ్రామంలో ఇళ్లను తనిఖీ చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రామంలో సఖ్యతగా ఉండాలన్నారు. అల్లర్లకు పాల్పడరాదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను మంచి మార్గంలో పెట్టుకోవాలన్నారు. గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లు వంటి వాటి జోలికి వెళ్లకుండా వారిపై నిఘా పెట్టాలని సూచించారు. మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.

కనులవిందుగా కల్యాణం

సోమందేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి సజ్జగుంట రంగనాథస్వామి కల్యాణోత్సవం కన్నుల విందుగా జరిగింది. అశేష సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శేషవాహన అలంకరణలో స్వామివారు దర్శనం ఇవ్వగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించినట్లు ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం బ్రహ్మరథోత్సవం ఉంటుందని, భక్తులు తరలిరావాలని కోరారు.

'బకాయిలు చెల్లించండి'

గోరంట్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు చెల్లించాల్సి వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వడిగేపల్లిలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరు వారాల కు సంబంధించి వేతనాలు రావాలని కూలీలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సెలవు దినాల్లోనూ పన్నులు చెల్లించవచ్చు: కమిషనర్

పెనుకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని పన్ను బకాయిదారులు చెల్లించాల్సిన పన్నులు ఈనెల 30వ తేదీలోపు చెల్లించి 50శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని కమిషనర్ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26సంవత్సరానికి సంబంధించి పన్నులు ఏకమొత్తంలో చెల్లించి ఐదు శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఈనెల 12 నుంచి 14 వరకు సెలవులు ఉన్నప్పటికీ పన్నులు చెల్లించే కౌంటర్ యథావిధగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి

- పెనుకొండలో మైనార్టీల ర్యాలీ



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు నష్టం కలిగించే వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం పెనుకొండలో వాయిస్ ఆఫ్ విక్టిమ్స్ పెనుకొండ మైనార్టీలు, మతపెద్దలు, మతగురువుల ఆధ్వర్యంలో పట్టణంలో ఈద్గా నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మైనార్టీలకు నష్టం కలిగించేలా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్య ఏకపక్షంగా ఉభయ సభల్లో ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వెంటనే బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓ గిరిధర్‌కు వినతిపత్రం అందించారు.

సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

గుడిబండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందించే పరికరాలను తీసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ రైతులకు సూచించారు. శుక్రవారం పి.సి. గిరి రైతు సేవా కేంద్రం కార్యాలయంలో రైతులకు సబ్సిడీ ద్వారా ట్రిల్లర్లు, స్ప్రేయర్లు తదితర పరికరాలను రైతులకు అందించారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని పంటల్లో మంచిదిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

పూలేకు ఘననివాళి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిబాపూలే అని వక్తలు కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.



మడకశిరలోని అమరాపురం బస్టాండు ఆవరణలో పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు



సూగూరు వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్ తదితరులు



గోరంట్ల ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్, సిబ్బంది



పెనుకొండలోని అంబేడ్కర్ సర్కిల్‌లో పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బహుజన చైతన్యవేదిక సభ్యులు శివరామకృష్ణ తదితరులు



లేపాక్షిలోని తహసీల్దార్ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న సిబ్బంది



జిల్లేడగుంట పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న హెచ్ఎం భూతన్న



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు కేవీ చలపతి, పార్థసారథి



పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



గుడిబండ ఎంజేపీ బాలికల కళాశాలలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు, అధ్యాపకులు



నివాళులు అర్పిస్తున్న అగళి ఎంపీడీఓ యాదవేంద్ర, సిబ్బంది

ఘనంగా తుమ్మల మారమ్మ ఊరేగింపు

గుడిబండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలిసిన తుమ్మలమారమ్మ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని గ్రామస్థులు ఘనంగా ఊరేగించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.